# పిక్ నిక్!



రచన: "గీతిక"

అది ఆగస్టు 15. ఆ రోజు మేము కాలేజీ ఫంక్షన్‌కు వెళ్ళకుండా ఫ్రెండ్సంతా కలిసి పిక్‌నిక్‌కని వెళ్ళాం! చూడవలసిన దృశ్యాలన్నీ ఒక్కొక్కటిగా చూస్తూ తిరుగుతున్నాం. మధ్య మధ్యలో జోకులు, నవ్వులు. నవ్వులు రాకున్నా నవ్వే వాళ్ళు కొందరు. మొత్తానికి మేమంతా హేపీగానే వున్నాం. వున్నట్టుండి ఒకేసారి మాలో ఏవో మాటలు గట్టిగా వినపడ్డాయి! అందరం అటు చూశాం!

మాలో ముగ్గురు ఏదో ఘర్షణ పడుతున్నారు. మేము వాళ్ళ దగ్గరకు చేరి విచారించాం. ఆ ముగ్గురిలో ఒకడికేమో మహాత్మాగాంధి అంటే బలే యిష్టం. రెండోవాడేమో సుభాష్‌చంద్రబోస్ అంటే పడి చస్తాడు. మూడోవాడేమో భగత్‌సింగ్ అభిమాని.

అందువలన ఆనాడు స్వాతంత్ర్య దినోత్సవము కనుక మన దేశానికి స్వతంత్రం తెచ్చిందెవరు? అన్న ప్రశ్న వచ్చి ఆ ముగ్గురూ గాంధీజీయే స్వతంత్రం తెచ్చాడని ఒకడంటే, కాదు నేతాజీ అని ఒకడు, లేదు వీళ్ళిద్దరూ కాదు భగత్ సింగేనని మరొకడు వాదించుకుంటున్నారు. మేమెంత సముదాయించినా ఏ ఒక్కడూ వినేటట్టు కనిపించలేదు. పోండి! కొట్టుకుచావండి అని వదిలేసాం.

మధ్యాహ్నం కావడంతో ఓ చెట్టు నీడన కూర్చుని ఎవరి టిఫన్‌లు వాళ్ళం విప్పుకుంటున్నాం.

'సురేష్! నా టిఫిన్ మూత రావట్లేదు. నువ్వు తియ్' అంటు నా కిచ్చాడు శీను. తీసుకుని విప్ప చూశాను, నాకు కూడా రాలేదు. నా పక్కవాడి కిచ్చాను. వాడికీ రాక మరొకడికిచ్చాడు. ఇలా ఓ నలుగురైదుగురు దాడిచేశారు. చివరకు శీను టిఫిన్ అయిదో వాని చేతిలో ఆ టిఫిన్ మూత వూడి వచ్చింది.

వెంటనే నాలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది.

'ఇప్పుడీ మూత తీసిందెవరో చెప్పండని' మొదట గొడవ పడిన ముగ్గురినీ అడిగాను.

ఆ ముగ్గురూ చివరగా ఎవరి చేతిలోనైతే మూత వూడిందో వాని పేరే చెప్పారు. మిగతా వాళ్ళందర్నీ అడిగాను. వాళ్ళూ అంతే చెప్పారు.

'అక్కడే మీరంతా పొరబడుతున్నారు. మేం నలుగురం ప్రయత్నం చేయడంవల్ల నాలుగింతలు లూజయి చివరకు అయిదోవాడి ప్రయత్నంలో పూర్తిగా తెరవబడింది. అంత మాత్రాన వాడి గొప్పతనమెలా అవుతుంది? అయిదుగురి గొప్పతనమవుతుంది గాని! అలాగే ఇందాక మీరు ముగ్గురూ గొడవపడిన విషయం కూడా' అన్నాను.

ఆ మాటల్లోనే అందరి భోజనాలయి కలయతిరగడానికి కదిలాం.

'సురేష్! వుండవలసిన వాడివిరా' అంటూ మెచ్చుకున్నారంతా నన్ను. వాళ్ళంతా మెచ్చుకున్నారని కాదు, నా ఆలోచనతో ఆ ముగ్గురులో సఖ్యత కలిగిందని తెలిసి సంతోషించాను.

